# కరెంట్ అఫైర్స్

## 18వ ఆసియా క్రీడలు

- 2018, ఆగస్టు 18 నుంచి సెప్టెంబరు 2 వరకు 18వ ఆసియా క్రీడలను ఇండోనేషియాలో నిర్వహించారు.
- రాజధాని జకార్తా, మరో ప్రధాన నగరం పాలెంబాంగ్‌లలో ఈ క్రీడలను నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే వీటిని 'జకార్తా పాలెం బాంగ్ 2018'గా కూడా పిలుస్తున్నారు.
- ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో క్రీడలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఆసియా ఒలింపిక్ సమాఖ్య (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ అహ్మద్ అల్‌ఫదా అల్‌సబా, ఆసియా క్రీడల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఎరిక్ తొహిర్‌లు కూడా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- ఇండోనేషియా దేశ చిహ్నం గరుడపక్షి వేషం ధరించిన కళాకారులు క్రీడల మార్చ్‌ఫాస్ట్‌లో ముందు నడవగా 45 దేశాల అథ్లెట్లు అనుసరించారు. మార్చ్‌ఫాస్ట్‌లో మొదట అఫ్గానిస్థాన్, చివరగా ఆతిథ్య ఇండోనేషియా ప్రవేశించాయి.
- జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా నేతృత్వంలో భారత బృందం మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొంది.
- ఉత్తర, దక్షిణ కొరియాలు ఒకే జట్టుగా మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ రెండు దేశాలూ ఇలా మార్చ్‌ఫాస్ట్ చేయడం ఇది రెండోసారి. 2018 ప్యాంగ్‌చాంగ్ శీతాకాల ఒలింపిక్స్‌లోనూ రెండు దేశాలూ కలిసి నడిచాయి.
- 'ఎనర్జీ ఆఫ్ ఏషియా' అనే మోటోతో ఈ క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడల మస్కట్స్‌గా 'భిన్‌భిన్' (స్వర్గం యొక్క పక్షి), అతుంగ్ (బేవియన్ జింక), కాకలను (ఒంటికొమ్ము ఖడ్గమృగం) ఉపయోగించారు. ఇవి ఇండోనేషియాలోని వివిధ ప్రాంతాల వైవిధ్యాన్ని సూచిస్తాయి.
- 18వ ఆసియా క్రీడల్లో తొలి స్వర్ణాన్ని చైనా క్రీడాకారుడు సన్ పీ యాన్ (ఉషులో) నెగ్గాడు.
- 18వ ఆసియా క్రీడల్లో భారత్ కాంస్యంతో ఖాతా తెరిచింది. షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అపూర్వి చండేలా 2 రవికుమార్ జోడీ కాంస్య పతకం సాధించింది.
- కుస్తీ వీరుడు భజరంగ్ పునియా భారత్‌కు తొలి స్వర్ణం అందించాడు. పురుషుల 65 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో స్వర్ణం నెగ్గాడు.
- భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 50 కిలోల విభాగంలో స్వర్ణం నెగ్గింది. ఆసియా క్రీడల్లో స్వర్ణం నెగ్గిన భారత తొలి మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది.
- పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో 16 ఏళ్ల సౌరభ్ చౌదరి స్వర్ణం నెగ్గాడు. ఏషియాడ్‌లో ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.
- మహిళల 25 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రాహీ సర్నోబత్ స్వర్ణం నెగ్గింది. ఏషియాడ్‌లో పసిడి గెలిచిన భారత తొలి మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించింది.
- రోయింగ్ క్వాడ్రాపుల్ స్కల్స్‌లో సవర్ణ సింగ్, దత్తుబాబన్, భొకానల్, సుఖ్మీత్‌సింగ్, ఓం ప్రకాష్‌లతో కూడిన భారత జట్టు చారిత్రక స్వర్ణాన్ని నెగ్గింది.
- టెన్నిస్ పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న-దివిజ్ శరణ్ జోడీ స్వర్ణాన్ని నెగ్గింది.
- షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ తూర్ స్వర్ణం నెగ్గాడు. గుండును 20.75 మీటర్ల దూరం విసిరి ఆసియా క్రీడల్లో సరికొత్త రికార్డు సృష్టించాడు.
- పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా స్వర్ణం నెగ్గాడు. ఏషియాడ్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారత జావెలిన్ త్రోయర్‌గా రికార్డు సృష్టించాడు.
- పురుషుల 800 మీటర్ల పరుగులో మంజీత్ సింగ్ స్వర్ణం నెగ్గాడు.
- పురుషుల ట్రిపుల్ జంప్‌లో అర్పిందర్ సింగ్ స్వర్ణం నెగ్గాడు.

- మహిళల హెప్టాథ్లాన్‌లో (ఏడు క్రీడలు కలిపి) స్వప్న బర్మన్ స్వర్ణం నెగ్గింది. ఏషియాడ్‌లో ఈ ఘనత సాధించిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డు సృష్టించింది.
- పురుషుల 1500 మీటర్ల పరుగులో జిన్సన్ జాన్సన్ స్వర్ణం నెగ్గాడు.
- మహిళల 4 × 400 రిలేలో హిమదాస్, పూవమ్మ, సరితాబెన్, విస్మయ కొరోత్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణం నెగ్గింది.
- పురుషుల బాక్సింగ్ 49 కిలోల విభాగంలో అమిత్ ఫంఘాల్ స్వర్ణం నెగ్గాడు. తాజా ఆసియా క్రీడల్లో భారత్‌కు ఏకైక బాక్సింగ్ స్వర్ణం అమిత్‌దే.
- పురుషుల బ్రిడ్జ్ పెయిర్ క్రీడలో ప్రణబ్ బర్ధన్, శివనాథ్ సర్కార్‌ల జోడీ స్వర్ణం సాధించింది. ప్రణబ్ వయసు 60 ఏళ్లు కాగా, శివనాథ్‌కు 56 ఏళ్లు. ఆసియా క్రీడల్లో పతకం గెలిచిన అతిపెద్ద వయస్కుడిగా ప్రణబ్ రికార్డు సృష్టించాడు.
- భారత్ 18వ ఆసియా క్రీడల్లో మొత్తం 15 స్వర్ణాలు నెగ్గింది. వీటితోపాటు 24 రజతాలు, 30 కాంస్యాలతో మొత్తం 69 పతకాలు సాధించి పతకాల పట్టికలో 8వ స్థానంలో నిలిచింది.
- 1951లో దిల్లీలో జరిగిన తొలి ఆసియా క్రీడల తర్వాత భారత్ 15 స్వర్ణాలు సాధించడం ఇదే తొలిసారి. మొత్తంగా 69 పతకాలతో 2010లో నెలకొల్పిన 65 పతకాల రికార్డును అధిగమించారు. మొత్తంగా ఆసియా క్రీడల చరిత్రలో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన.
- ముగింపులో భారత మహిళల హాకీ జట్టు కెప్టెన్ రాణీరాంపాల్ భారత పతాకధారిగా వ్యవహరించారు.
- ఇండోనేషియా అధ్యక్షుడు వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. దేశ ఉపాధ్యక్షుడు మహ్మద్ జూసుఫ్ కల్లా ముగింపు వేడుకలకు హాజరయ్యారు. ఆసియా ఒలింపిక్ సమాఖ్య అధ్యక్షుడు షేక్ అహ్మద్ అల్‌ఫదా అల్‌సబా 18వ ఆసియా క్రీడలు ముగిసినట్లు ప్రకటించారు. ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ పతకాన్ని అవనతం చేసి ఆ పతకాన్ని 19వ ఆసియాడ్‌కు ఆతిథ్యమిచ్చే హాంగ్‌ఝౌ (చైనా) నగర మేయర్ గ్జూలియాకి అందజేశారు. జకార్తా గవర్నర్ అనిస్ బాస్వెడాన్ ఆసియా క్రీడల టార్చ్‌ను చైనా ఒలింపిక్ కమిటీ ఛైర్మన్ గౌ జోంగ్వేన్‌కు అందించారు.

**పతకాల పట్టిక**

| స్థానం | దేశం | స్వర్ణం | రజతం | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|---|
| **1.** | చైనా | 132 | 92 | 65 | 289 |
| **2.** | జపాన్ | 75 | 56 | 74 | 205 |
| **3.** | దక్షిణ కొరియా | 49 | 58 | 70 | 177 |
| **4.** | ఇండోనేషియా | 31 | 24 | 43 | 98 |
| **5.** | ఉజ్బెకిస్థాన్ | 21 | 24 | 25 | 70 |
| **8.** | భారత్ | 15 | 24 | 30 | 69 |

## 2 + 2 మంత్రుల తొలి సమావేశం

- భారత్, అమెరికా దేశాల విదేశాంగ, రక్షణ శాఖల (2 + 2) మంత్రుల తొలి సమావేశం 2018, సెప్టెంబరు 6న దిల్లీలో జరిగింది.
- భారత్ నుంచి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, అమెరికా తరపున విదేశాంగ మంత్రి మైకేల్ పాంపియో, రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు.
- రక్షణ రంగంలో అత్యంత కీలకమైన, క్లిష్టమైన సాంకేతికతను అమెరికా భారత్‌కు సమకూర్చే చారిత్రక కోమ్‌కాసా (కమ్యూనికేషన్స్, కంపాటిబిలిటీ, సెక్యూరిటీ అగ్రిమెంట్) ఒప్పందంపై ఇరు దేశాలు ఈ సందర్భంగా సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం పదేళ్లపాటు అమల్లో ఉంటుంది.
- ఇరు దేశాల సంయుక్త సైనిక విన్యాసాలు 2019లో భారత్‌లోని తూర్పు తీర ప్రాంతంలో నిర్వహించాలని నిర్ణయించారు.

## స్వలింగ సంపర్కం నేరం కాదు

- స్వలింగ సంపర్కం నేరం కాదంటూ 2018, సెప్టెంబరు 6న సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 17 ఏళ్లుగా వాదోపవాదాలు కొనసాగుతున్న ఈ వ్యవహారంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా) నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం 493 పుటల్లో సవివరమైన, చరిత్రాత్మకమైన తీర్పును ఏకాభిప్రాయంతోనే ప్రకటించింది. 158 సంవత్సరాలుగా అమల్లో ఉన్న భారత శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 377లోని కీలకమైన నిబంధనలను కొట్టేసింది.
- ఏకాభిప్రాయంతో చేసే అసహజ శృంగార చర్యను నేరంగా పరిగణిస్తూ 2013లో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును సీజేఐ ధర్మాసనం తాజాగా కొట్టివేసింది.
- స్వలింగ సంపర్కం నేరం అని ఐపీసీ సెక్షన్ 377 చెబుతుంది. ఈ సెక్షన్‌కు వ్యతిరేకంగా మొదట నాజ్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ 2001లో దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. స్వలింగ సంపర్కం నేరం కాదని దిల్లీ హైకోర్టు 2009లో తీర్పు చెప్పింది. 2013లో ఈ తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది.
- స్వలింగ సంపర్కం నేరం కాదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఈ తరహా లైంగిక చర్యను న్యాయబద్ధం చేసిన 125 దేశాల సరసన భారత్ చేరినట్లైంది.

## పాకిస్థాన్ కొత్త అధ్యక్షుడిగా ఆరిఫ్ అల్వీ

- 2018, సెప్టెంబరు 4న పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన డాక్టర్ ఆరిఫ్ అల్వీ (69) పాకిస్థాన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- జాతీయ అసెంబ్లీలోని 430 మంది సభ్యులు వేసిన ఓట్లలో అల్వీకి 212, సమీప ప్రత్యర్థి, పీఎంఎల్ పార్టీకి చెందిన మౌలానా ఫజల్ ఉర్ రెహమాన్‌కు 131 ఓట్లు లభించాయి. పీపీపీకు చెందిన ఎయితాజ్ ఎహసాన్‌కు 81 ఓట్లు వచ్చాయి.

## తెలంగాణ శాసనసభ రద్దు

- తెలంగాణలో నాలుగేళ్ల మూడు నెలల అయిదు రోజుల పాటు కొనసాగిన తెలంగాణ తొలి శాసనసభను రద్దుచేస్తూ రాష్ట్ర మంత్రి మండలి 2018, సెప్టెంబరు 6న తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్ నరసింహన్ అదే రోజున ఆమోదించారు. దీంతో 2014, జూన్ 2న ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం అయిదేళ్లు పూర్తి కాకుండానే ముగిసిపోయింది.

## కేసీఆర్‌కు బిజినెస్ రిఫార్మర్ అవార్డు

- ప్రముఖ మీడియా సంస్థ ఎకనామిక్ టైమ్స్ అందించే ప్రతిష్ఠాత్మకమైన 'ఎకనామిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్' అవార్డును 2018, సెప్టెంబరు 5న తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ప్రకటించారు.

## దుల్హన్, గిరిపుత్రిక కళ్యాణం పథకాల పేర్లు మార్పు

- దుల్హన్, గిరిపుత్రిక కళ్యాణం పథకాల పేర్లను దుల్హన్–చంద్రన్న పెళ్లి కానుక, గిరిపుత్రిక–చంద్రన్న పెళ్లికానుకగా మారుస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని మరింత విస్తృతం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న వరుడిని పెళ్లి చేసుకుంటేనే పథకం వర్తిస్తుండగా, తాజాగా పొరుగు రాష్ట్రాల వారిని వివాహం చేసుకున్న వధువులకు కూడా కానుక అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వరుడిని పెళ్లిచేసుకున్న వారికి మాత్రమే ఈ మినహాయింపు ఇవ్వాలని సూచించారు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**